క్లుప్తంగా

కనక దుర్గమ్మకు పూజలు



దుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ సి బ్లాకులోని కనక దుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్ర సంబరాలలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు), పిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డంపర్‌లో మంటలు



డంపర్‌లో ఎగసి పడుతున్న మంటలు

రాజమహేంద్రవరం రూరల్: బాలాజీ పేట సెంటర్ నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జికి వెళ్లే దారిలో ఉన్న డంపర్‌లో ఆదివారం అర్ధరాత్రి మంటలు ఎగసిపడ్డాయి. హోటళ్లలోని వ్యర్థాలను తీసుకువచ్చి దీనిలో వేస్తుంటారు. ఈ క్రమంలో కాల్చిన బొగ్గులను సైతం డంపర్‌లో వేయడంతో మంటలు రేగాయి. అయితే చుట్టుపక్కల ఎటువంటి నివాసాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 21 వినతులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 21 అర్జీలు వచ్చాయి. ఎస్పీ డి.నరసింహ కిశోర్ అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్ చేసి, ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

దళితులపై కూటమి వివక్ష



మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: దళితులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని, దళితవాడల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు కట్టిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్‌కే నాయుడు ప్రకటించడమే దీనికి నిదర్శనమని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ప్రధాన ఆలయాల్లో ప్రవేశానికి అనుమతి లేకుండా, అంటరానితనాన్ని ప్రోత్సహించేందుకు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. దళితులు ప్రధాన ఆలయాలకు వెళ్లకుండా వివక్షతో ఇలాంటి ప్రణాళిక రూపొందించారన్నారు. దళితులకు ప్రత్యేకంగా ఆలయాలు నిర్మించడం కాదని, ప్రధాన ఆలయాలలోకి వచ్చేలా సౌకర్యాలు కల్పించాలన్నారు.

వరద బాధితుల పునరావాస కేంద్రం తనిఖీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల సహాయక పునరావాస కేంద్రాన్ని రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) అధికారి ఆర్.కృష్ణ నాయక్ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. అక్కడి వైద్య శిబిరం, బాధితులకు ఇస్తున్న భోజనం, ఇతర వసతులను పరిశీలించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో బ్రిడ్జి లంక నుంచి 123 మంది, కేతావారీ లంక నుంచి 75 మంది, వెదురమ్మలంక నుంచి 76 మంది ఉన్నారన్నారు. మొత్తం 98 కుటుంబాలకు చెందిన 274 మంది ఆశ్రయం పొందుతున్నారని ఆర్డీవో తెలిపారు. అక్కడి బాధితులతో ఆయన మాట్లాడి, వారి అవసరాలను తెలుసుకున్నారు. భోజనం, వైద్య సదుపాయాలు సరైన సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకూ పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు.

జీఎస్టీ ప్రయోజనంపై అవగాహన కల్పించాలి

రాజమహేంద్రవరం సిటీ: జీఎస్టీ సంస్కరణల మూలంగా క్షేత్రస్థాయిలో చేకూరే మేలును ప్రజలకు వివరించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభిస్తుందన్నారు. కావున దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రతి ఇంటికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.

అరచి.. కరచి



- గ్రామాల్లో కుక్కల స్వైర విహారం
- పాదచారులు, వాహన చోదకులే టార్గెట్
- ప్రజల భయాందోళన

కడియం: గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు అటుగా వెళుతున్న పాదచారులు, వాహన చోదకులను బెంబేలెత్తిస్తున్నాయి. పదుల సంఖ్యలో సంచరిస్తూ.. చిన్నారులు, వృద్ధులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇది ఏ ఒక్క పంచాయతీతో, వార్డు సమస్య మాత్రం కాదు, దాదాపు రూరల్ నియోజకవర్గంలో ఏ పంచాయతీకి వెళ్లినా అక్కడి స్థానికులు కుక్కల బెడదతో విసిగిపోతున్నారు. వీధి కుక్కల కాట్ల బారిన పడి, ప్రభుత్వ ఆసుపత్రులకు రేబిస్ వ్యాక్సిన్ కోసం క్యూ కట్టే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. దీన్నిబట్టి వీధి కుక్కల బెడద ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు.

నియోజకవర్గంలో..

రాజమహేంద్రవరం నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల పరిధిలో ఉన్న ప్రతి పంచాయతీలోనూ 500 నుంచి 1000 వరకూ వీధి కుక్కలు సంచరిస్తున్నాయని అంచనా. వీటి సంతతిని నియంత్రించేందుకు ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు మాత్రం లేవు. దీంతో ఏటా వీటి సంఖ్య భారీగా పెరిగిపోతోంది. పరిమితికి మించి పెరుగుతున్న ఇవి గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహన చోదకులు, పాదచారులను భయపెడుతున్నాయి. వారిపై దాడి చేసి, గాయపర్చుతున్నాయి.

భయపడి..

ఉదయాన్నే మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు సైతం కుక్కలకు భయపడి కర్రలు చేత్తో పట్టుకుని గానీ, బృందంగా గానీ వెళుతున్నారు. దారిలో ఒక్కసారిగా ఇవి మీద పడుతుండడంతో ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి, రోడ్డుపై పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక చీకటి పడితే రోడ్ల మీద వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చిన్న పిల్లలను, వృద్ధులను బయటకు పంపేందుకు జంకుతున్నారు.

చూసీచూడనట్టు..

జీవ వైవిద్యంలో భాగంగా వీధి కుక్కల సంతతిని పూర్తిగా నిర్మూలించడానికి చట్టాలు అనుమతించడం లేదన్నది వాస్తవం. అయితే అవే చట్టాలు వీటి సంతతిని నియంత్రించే చర్యలు చేపట్టాలని కూడా స్పష్టంగానే చెప్పాయి. వీధి కుక్కలకు సంతతి నియంత్రణ ఆపరేషన్లు చేయడం మొదలు పలు సూచనలు కూడా చేశాయి. అయితే ఇవన్నీ ఎంతో వ్యయ, ప్రయాసలతో కూడుకున్నవి కావడంతో గ్రామ పంచాయతీలు కుక్కల నియంత్రణకు నిబంధనలనే సాకుగా చూపుతున్నాయి. ఇలా గ్రామ పంచాయతీలు చూసిచూడనట్టు వ్యవహరిస్తుండడంతో వీటి బారిన పడిన ప్రజలు.. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.



రోడ్డు పక్కనే గుంపుగా చేరిన వీధి కుక్కలు

నియంత్రించాలి

కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఒక్కసారిగా వాటిలో అవే కొట్లాటకు దిగుతున్నాయి. ఆ సమయంలో సమీపంలో ఉన్నవారిపై దాడి చేస్తున్నాయి. వాహన చోదకులైతే అదుపు తప్పి పడిపోతున్నారు. పాదచారులైతే వీటి కాట్లకు గురి కావడం, గాయాలపాలవ్వడం జరుగుతోంది. కుక్కలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

– పి.నాగేశ్వరరావు, హుకుంపేట

చర్యలు చేపట్టాలి

వీధి కుక్కల నియంత్రణకు నిబంధనలు ఉన్నమాట వాస్తవమే. అయితే అదే సమయంలో ప్రజల ఇబ్బందులను కూడా పట్టించుకోవాలి. అంతే తప్ప చూసీ చూడనట్టు వదిలేస్తే ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు తక్షణం వీటిపై తగు చర్యలు చేపట్టాలి.

– కేవీఎస్ రావు, కడియపులంక

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్



పీహెచ్‌సీ నోటీసు బోర్డులో అతికించిన డాక్టర్ల డిమాండ్ల పత్రం

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేసే వరకూ ఆందోళన కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సేవలను బంద్ చేశారు. పీహెచ్‌సీలలోనే అందుబాటులో ఉంటూ పాముకాటు, ప్రమాదాలు, డెలివరీ తదితర అత్యవసర కేసులు మాత్రమే చూస్తున్నారు. ఈ మేరకు పీహెచ్‌సీలలో ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నోటీసుబోర్డులో తమ కార్యాచరణను ప్రజలకు తెలుపుతూ తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అతికించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక మాట్లాడుతూ జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలన్నారు. సమయ నిర్ధారితమైన ప్రమోషన్స్‌తో పాటు ట్రైబల్ అలవెన్సు, ఇతర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపడతామని తెలిపారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

అభివృద్ధి శిలాఫలకాల ధ్వంసం దారుణం

- కలెక్టర్, అధికారులు చర్యలు చేపట్టాలి
- మాజీ ఎంపీ భరత్‌రామ్





కూటమి ప్రభుత్వం ధ్వంసం చేయించిన శిలాఫలకం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పాలనలో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కూటమి ప్రభుత్వం పగులగొట్టించడం దారుణమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. ఆయన సోమవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 40వ డివిజన్‌లో తన హయాంలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేయించిన చోట వేసిన శిలాఫలకాన్ని పగులగొట్టడం కూటమి ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో చేసిన పనులు ఏమీ లేనప్పటికీ, వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మోరంపూడి ఫ్లైఓవర్ దగ్గర శిలాఫలకాన్ని ఈ విధంగానే ధ్వంసం చేసి, ఆ తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో పునరుద్ధరించారన్నారు. తిలక్ రోడ్డులో సీసీ డ్రైన్ శంకుస్థాపన శిలాఫలకాన్ని కూడా ధ్వంసం చేశారన్నారు. శిలాఫలకాలను కూలగొట్టగలరేమో గానీ, చేసిన అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలను ప్రజల మనోఫలకాల నుంచి తొలగించలేరన్నారు. శిలాఫలకం తొలగించడానికి చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవన్నారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా కలెక్టర్, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మంచి జీవనశైలితో గుండె వ్యాధులు దూరం



వైద్యనిపుణులకు సత్కరిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మంచి ఆహార పద్ధతులు, జీవనశైలి, అవసరమైన నిద్రతో గుండె వ్యాధులను దూరంగా ఉంచవచ్చని కిమ్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామరాజు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా రాజమహేంద్రవరంలోని కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్ హార్ట్‌పై సోమవారం హోటల్ ఆనంద్ రీజెన్సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామరాజు మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ తినడం, నిద్రలేమి, శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే గుండె పోటుకు గురై మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కిమ్స్ హాస్పిటల్ ద్వారా ఇప్పటి వరకు 2 లక్షలకు పైగా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు మరింత మెరుగైన, ఉన్నతమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో త్వరలోనే వై.జంక్షన్ వద్ద నిర్మితమవుతున్న 400 పడకల కిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. డాక్టర్ సతీష్, డాక్టర్ ఫణితేజ, డాక్టర్ రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గుండె వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎంపీ హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర హౌసింగ్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులను ఆసుపత్రి తరఫున సత్కరించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి ఉచిత రక్త పరీక్షలు చేసి, వారికి రిస్క్ అసెస్మెంట్ చెప్పి, అవసరమైన వైద్య సలహాలను అందజేశారు. అలాగే కిమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్య నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ కృష్ణశ్రీ, డాక్టర్ మణికంఠ పాల్గొన్నారు. కాగా.. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 430 మందికి బ్లడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వారికి గుండె డాక్టర్లతో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆనంద్ రీజెన్సీలో మంగళవారం కూడా ఉచిత స్క్రీనింగ్‌లు నిర్వహించి, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలు అందజేస్తామని కిమ్స్ బొల్లినేని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

తప్పుడు కేసులు మానండి



మీడియాతో మాట్లాడుతున్న మగ్బూల్ బాషా

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టడం మానేసి.. ప్రజలకు మంచి చేసే పాలన సాగించాలని వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్ బాషా అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఎంపీ మిథున్‌రెడ్డితో ఆయన, రాష్ట్ర కార్యదర్శి మధుమితరెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. లేని స్కాంలో మిథున్ రెడ్డిని ఇరికించారన్నారు. కేసు నుంచి మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయట పడతారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ సాదిక్ హుసేన్ పాల్గొన్నారు.

దసరాకైనా బకాయిలు చెల్లించండి

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం దసరా పండగకైనా ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ సత్యనారాయణ, రెడ్డి అన్ను వెంకట్రావు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. దసరా పండగకు డీఏ ఇవ్వాలని, జెడ్‌పీపీఎఫ్ పార్ట్ ఫైనల్ పేమెంట్ వైద్య, గృహ అవసరాల పేమెంట్‌కు నిధులు విడుదల చేయాలన్నారు. అసెస్మెంట్ పరీక్షల బుక్‌లెట్ విధానాన్ని పునఃసమీక్షించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కుంకుమార్చన



పడిపూజలో పాల్గొన్న భరత్‌రామ్ కుటుంబ సభ్యులు



సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో సోమవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, పడిపూజ, భవానీ భజన వైభవంగా నిర్వహించారు. భరత్‌రామ్, మోనా దంపతులు, కుమార్తెలు, రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వర రావు దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాలు జరిపారు. దసరా నవరాత్రుల సందర్భంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు , పుర ప్రముఖులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, భవానీలు, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ రికార్డుల కంప్యూటరీకరణ

సీటీఆర్ఐ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు సంబంధించిన ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీలతో వక్ఫ్ రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్నట్టు ఏపీ వక్ఫ్ బోర్డు సీఈవో షేక్ మహమ్మద్ అలీ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వక్ఫ్ రికార్డుల కంప్యూటీకరణపై ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటీకరణ చేయడం వల్ల రికార్డులన్నీ పక్కాగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ హాజీ ముకరమ్ హుస్సేన్, తూర్పు గోదావరి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు

క్రూసిబుల్ పరిశ్రమలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పేరూరి గంగాధరం

సీటీఆర్ఐ: గ్రాఫైట్ క్రూసిబుల్ చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని ది ఆల్ ఇండియా గ్రాఫైట్ క్రూసిబుల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పేరూరి గంగాధరం, అధ్యక్షుడు కొంకు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వనము జగదీశ్ బాబు కోరారు. రాజమహేంద్రవరంలోని గ్రాఫైట్ క్రూసిబుల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రాఫైట్ క్రూసిబుల్ చిన్న తరహా పరిశ్రమలు నిర్వహించడం భారంగా మారిందన్నారు. ప్రభుత్వం వాటిపై 18 శాతం జీఎస్టీ విధించిందని, దాన్ని ఐదు శాతానికి తగ్గించాలని కోరారు. పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు నూతన టెక్నాలజీపై కార్మికులకు కార్మిక శాఖ ద్వారా అవకాశం కల్పించి, యంత్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

నూతన కార్యవర్గం ఇదే...

ది ఆల్ ఇండియా గ్రాఫైట్ క్రూసిబుల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా పేరూరి గంగాధరం, అధ్యక్షుడిగా కొంకు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వనము జగదీశ్ బాబు, కె.శివరామకృష్ణ (సామర్లకోట), ప్రధాన కార్యదర్శిగా రాయపూడి మల్లేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా పేరూరి కాశీ రాజ్ కుమార్, కోశాధికారిగా మజ్జి నమ్రత రెడ్డి ఎన్నికయ్యారు.

మముబ్రోవవే... వీణాపాణి



దుళ్ల గ్రామంలోని శారదా అమ్మవారి ఆలయంలో సరస్వతీ పూజలు చేస్తున్న చిన్నారులు

- సరస్వతీ దేవీ అలంకరణలో దుర్గాదేవి
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు

సీటీఆర్ఐ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో సోమవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షతం కావడంతో భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలో సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకునేందుకు అశేష భక్తజనం తరలివచ్చారు. దేవీచౌక్‌లో అమ్మవారు సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. సీతంపేట రామమందిరంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మీదేవి, విజయ కనక దుర్గాదేవి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు.

కడియం: మూలానక్షత్రం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కడియంలోని కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారి ఆలయం వద్ద 500 మంది విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. దుళ్ల శ్రీ పోలేరమ్మ ఆలయం వద్ద సరస్వతీ పూజలు జరిగాయి. కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలోని అపర్ణాదేవి అమ్మవారు సరస్వతీమాతగా దర్శనమిచ్చారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఉదయం విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.



కడియపులంకలో శారదాదేవిగా దర్శనమిచ్చిన అపర్ణాదేవి



మోరంపూడిలో విజయ కనకదుర్గాదేవి



జ్ఞాన సరస్వతీ పీఠంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు



సీతంపేట రామాలయంలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు